




# ఈకాలం

THE HONEST TELUGU DAILY

మంగళవారం 24-02-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :116 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల







## ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం

- మెట్రో విస్తరణకు తొలగనున్న అడ్డంకులు
- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టిటిడి నిర్మాణాలకు 20 ఎకరాలు
- మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు




హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో..

## మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

**అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతారామన్**



దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి.

2లో

## ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- గంటముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది.

2లో

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం



- పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం
- హైదరాబాద్‌లో పలుచోట్ల మోస్తరు వర్షం

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భాగ్యనగరంలో పలుచోట్ల వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపం చూపినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మబ్బుపట్టి చల్లని గాలులు వీచడంతో నగరంలో ఆహ్లాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి.

2లో

## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త




హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 60 ఏళ్లలోపు ఉద్యోగి చనిపోతే రెగ్యులర్ బెనిఫిట్లతో పాటు అదనంగా రూ.10 లక్షలు వచ్చేలా చర్యలు చేపట్టినట్లు ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం పలు అంశాలపై చర్చించింది. మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వెల్లడించారు.

2లో

## రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

- రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి
- దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం
- డిసిసి అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సిఎం భట్టి



2లో

## తిరుమల క్యూలైన్‌లో పాముకాటు ప్రచారం.. అసలు వాస్తవం ఇదీ!



2లో

## ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల

**డిఎస్సీ కూడా అందులోనే ఉంటుంది**

**ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి లోకేశ్ సమాధానం**



అమరావతి, రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఈ జాబ్ క్యాలెండర్‌లోనే డీఎస్సీ పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు.

2లో

## రాజమండ్రి కల్తీ పాల ఘటనపై ఏపీసీసీ చీఫ్ ధ్వజం

- నిందితులపై కఠిన చర్యలకు డిమాండ్
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి
- కల్తీ సరఫరాపై ఉన్నత స్థాయి దర్యాప్తు

తక్షణం మెడికల్ క్యాంపుల ఏర్పాటు



2లో

రాజమండ్రిలో కల్తీ పాల ఘటన తీవ్ర భయాందోళనకు గురిచేసిందని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి తెలిపారు. విషపు పాలు తాగి రెండు రోజుల్లో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.

## కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోవాలి



- శాసనసభలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గళం
- 15 ఏళ్లుగా పెండింగ్‌లో బకాయిలు
- ఆర్థిక ఇబ్బందులతో కార్మికుల మృతి
- వెయ్యి మంది వృద్ధ కార్మికుల నిరీక్షణ
- కోట్లాది రూపాయల నిధుల విడుదలపై

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ మూతపడి 15 ఏళ్లు కావడంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఆ కార్మికుల బకాయిలు చెల్లించి ఆదుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శాసనసభలో తెలిపారు. ఫ్యాక్టరీలో గతంలో 3 వేల మంది కార్మికులు పనిచేసేవారని, న్యాయం కోసం పోరాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సుమారు 2 వేల మంది మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.

2లో

## ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు: ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



కామారెడ్డి: కామారెడ్డిలో కాంగ్రెస్-భాజపా నేతల మధ్య వివాదం ముదిరింది. పట్టణంలోని డిగ్రీ కళాశాల భూముల వ్యవహారంపై ఇరు పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తానని భాజపా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రకటించారు. తాము కూడా కలెక్టరేట్‌కు వెళ్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటిముందు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తాను తప్పుచేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని చెప్పారు. "డిగ్రీ కాలేజీ భూముల్లో ఒక్క గజం ఆక్రమించినట్లు తేలినా రాజీనామా చేస్తా. కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి సవాల్ చేశాను. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ఎవరు రెచ్చగొడుతున్నారో పోలీసులకు తెలియదా?సమాచార హక్కు చట్టం కింద కాలేజీ భూముల వివరాలు అడిగాను. పూర్తి వివరాలు వచ్చాక.. అందరి సంగతి చూస్తాం"అని ఎమ్మెల్యే అన్నారు.

# సంపాదకీయం

## రాహుల్‌కు ఎందుకీ కంటగింపు?

సమర్థ నాయకత్వం, సరైన మార్గదర్శనంతో భారత్ గత పన్నెండేళ్లుగా.. వికసిత భారతదేశ నిర్మాణం కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుంది. ప్రజల భాగస్వామ్యంతో వాటిని సాధించే దిశగా అడుగులేస్తోంది. 'ఆత్మనిర్భర' నినాదంతో దేశీయంగా మన కాళ్లమీద మనం నిలబడే విధంగా చర్యలు తీసుకుంటూ.. విదేశాలతో బలమైన సంబంధాలను ఏర్పర్చుకుంటూ.. దేశ 'బంగారు భవిష్యత్తుకు భరోసా'ను సుస్థిరం చేసుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో.. పుష్కరకాలంగా ప్రపంచంలోని ముఖ్య దేశాలు, కీలక కూటములతో భారతదేశం వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, 27 దేశాల సమాహారమైన యూరోపియన్ యూనియన్, బ్రిటన్, ఒమన్, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాలతో కుదుర్చుకున్న మొత్తం 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో (ఫ్టీూ) భారత్.. ఉత్పత్తి, సేవల, వ్యవసాయ రంగాలకు మన దేశంలో పెద్దఎత్తున కొత్త మార్కెట్లకు ద్వారాలు తెరుచుకున్నాయి. గ్లోబల్ సప్లయ్ చైన్స్ పునర్వ్యవస్థీకృతమవుతున్న ఈ సమయంలో ఫ్టీూల ద్వారా భారత్.. అంతర్జాతీయంగా అనేక దేశాలకు అత్యంత విశ్వసనీయమైన భాగస్వామిగా నిలుస్తోంది.

ఇలాంటి వ్యూహాత్మకమైన సమయంలో.. ప్రధాని మోదీ నాయకత్వంలో కుదిరిన భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం ఒక వాణిజ్య ఒప్పందంగా మాత్రమే కాకుండా.. 21వ శతాబ్దపు భారత్ అభివృద్ధి ప్రయాణంలో ఓ కీలక మైలురాయిగా నిలిచిపోనుంది. భారత్, అమెరికా ఒప్పందంపై సరైన అవగాహన లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పిస్తున్నారు. కానీ, దేశ ప్రయోజనాలను కాపాడే విషయంలో రాజీపడకుండా.. 140 కోట్ల భారతీయుల విశ్వాసాన్ని సంపాదించుకున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను సహించలేక, చేస్తోన్న మంచి పనులను.. అబద్ధాలతో, అసందర్భంగా కాంగ్రెస్ పార్టీ గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుంది.

భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని మూడు ప్రధాన కోణాల్లో అర్థం చేసుకోవాలి. మొదటిది.. సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవడం, రెండోది.. పెట్టుబడుల విస్తరణ, మూడోది.. గ్లోబల్ వ్యాల్యూ చెయిన్‌లో భారతదేశ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం, ఇవి ప్రధాన లక్ష్యాలుగా కార్యాచరణ ఏర్పాటు చేసుకున్నాం. ప్రపంచంలో అతిపెద్ద మార్కెట్‌గా, సేవల కేంద్రంగా భారత్ ఎదిగింది. ఇప్పుడు.. ఉత్తమ సాంకేతికత తయారీ, డిజైన్‌లకు కేంద్రంగా మారేందుకు ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ, డిఫెన్స్, స్పేస్, సైబర్ సెక్యూరిటీ లాంటి అనేక రంగాల్లో మనం మరింత పురోగతి సాధించేందుకు వీలుపడనుంది. ఈ సాంకేతికత ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా.. అత్యాధునిక పరిజ్ఞానం

## ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం

మొదటిపేజీ తరువాయి

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవే శ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన పక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను

## ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల

మొదటిపేజీ తరువాయి

ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్ అమలు చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేశ్ సమాధానమిస్తూ.. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో కేజీబీవీలకు ఎక్కువ డిమాండ్ ఉందని, అడ్మిషన్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొందని తెలిపారు. జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు

చేపడతామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న పారిశ్రామిక ఎకో సిస్టమ్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను 'క్లస్టర్ బేస్డ్ అప్రోచ్' ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

మొదటిపేజీ తరువాయి

చాలా రోజుల తర్వాత కురిసిన చిరు జల్లులు భాగ్యనగరాన్ని మురిపించాయి.ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్న తరుణంలో హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు పలకరించాడు. నగరంలో ఆకాశం మేఘావృతం కాగా.. ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, కాచిగూడ సహా పలుచోట్ల చిరు జల్లులు కురుస్తున్నాయి. మరోవైపు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్లే వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా అబిడ్స్, బషీర్ బాగ్, సైఫాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అలాగే మీర్ పేట్, బడంగ్ పేట్ ప్రాంతాల్లోనూ వాన పడింది. ఎల్బీ నగర్, మలక్ పేట్, సరూర్ నగర్, చార్మినార్, బీఎన్ రెడ్డి, ఉప్పల్, నాగోల్, అంబర్ పేట్, వనస్థలిపురం, హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో ఈదురు గాలులు బలంగా వీచాయి. వికారాబాద్ ప్రాంతంలో వీస్తున్న భారీ ఈదురు గాలులు ప్రస్తుతం హైదరాబాద్ దిశగా వేగంగా కదులుతున్నాయి. ఈ ప్రభావంతో సాయంత్రం 6 గంటల తర్వాత గచ్చిబౌలి, రాజేంద్ర నగర్, లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో బలమైన గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. నగరంలో వాతావరణం చల్లబడితే, జిల్లాల్లో మాత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాకలో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన (రాళ్ల వర్షం) కురిసింది. భారీ గాలుల కారణంగా షాపుల బోర్డులు, ఫ్లెక్సీలు ఎగిరిపోయాయి. కొన్ని రేకుల ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి

దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు..

భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తాజా ధరల వివారల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,724 పెరిగి.. రూ.1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.15,931 పెరిగి రూ.2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు' అని పేర్కొన్నారు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..

## రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

మొదటిపేజీ తరువాయి

రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు. వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో

## ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ స్జబెక్టులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ స్జబెక్టులకు, రెండో సంవత్సరం అన్ని స్జబెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు.విద్యార్దులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లకుండా పరిశీలించి లోపలికి అనుమతించారు. బాలురు కు పురుషులు, బాలికలకు మహిళా సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్దులు వెంట తల్లి తండ్రులు వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు..విద్యార్దులు ఉత్సాహంగా ఒకరిని ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ లోపలికి వెళ్ళారు. ఉదయం చేరుకున్న విద్యార్థులు వారి యొక్క హాల్ టికెట్స్ నెంబర్ల సరి చూసుకొని పరీక్ష కేంద్రం లోపలికి వెళ్ళారు.

## రాజమండ్రి కల్తీ పాల ఘటనపై ఏపీసీసీ చీఫ్ ధ్వజం

మొదటిపేజీ తరువాయి

కిడ్నీ సమస్యతో పరిస్థితి విషమించి ఎనిమిది మంది ఆసుపత్రుల్లో చేరడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ పక్షాన సానుభూతి తెలుపుతూ, కూటమి ప్రభుత్వాన్ని పలు డిమాండ్లు చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి తక్షణం మెరుగైన వైద్యసేవలు అందించాలని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కల్తీ పాల సరఫరాపై నిజాలు నిగ్గుతేల్చేందుకు ఉన్నత స్థాయి కమిటీ నియమించి దర్యాప్తు ముమ్మరం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల సంఖ్య పెరగకుండా తక్షణం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

## కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోవాలి

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం జీవించి ఉన్న వెయ్యి మంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి మానవతా దృక్పథంతో సానుకూలంగా స్పందించి బకాయిలను త్వరితగతిన చెల్లించాలని ప్రశాంతి రెడ్డి కోరారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

మొదటిపేజీ తరువాయి

"ఉద్యోగుల ఆరోగ్య భద్రత, ప్రమాదాల విషయంపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు, పింఛనర్లకు భారం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. రాష్ట్రంలో 7.56 లక్షల మంది ఉద్యోగులు, పింఛనర్లు ఉన్నారు.ఉద్యోగి చనిపోతే రెగ్యులర్ బెనిఫిట్లతో పాటు అదనంగా రూ.10 లక్షలు వచ్చేలా పథకం తీసుకొస్తాం. 17.7 లక్షల మంది ఉద్యోగులు, పింఛనర్లకు డిజిటల్ హెల్త్ ఎంప్లాయ్ కార్డులు అందజేస్తాం. 1998 వ్యాధులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 652 ఆస్పత్రుల్లో చికిత్స అందేలా ఏర్పాట్లు చేస్తాం. రాబోయే 2-3 రోజుల నుంచి ఎంప్యానల్ ఆస్పత్రుల్లో చికిత్సకు ఏర్పాట్లు చేస్తాం. ఉద్యోగుల బేసిక్ పే నుంచి 1.5 శాతం ట్రస్టుకు జమ అయ్యేలా చర్యలు చేపడతాం. ఉద్యోగుల నుంచి రూ.528 కోట్లు సేకరిస్తాం. దీనికి అదనంగా ప్రభుత్వం మరో రూ.528 కోట్లు జత చేసి.. ట్రస్టు ఖాతాలో జమ చేస్తుంది. సీఎస్, సభ్యుల ఆధ్వర్యంలో ట్రస్టు నిర్వహణ ఉంటుంది" అని మంత్రి పొంగులేటి వివరించారు.

## తిరుమల క్యూలైన్‌లో పాముకాటు ప్రచారం.. అసలు వాస్తవం ఇదీ!

మొదటిపేజీ తరువాయి

తిరుమల క్యూలైన్‌లో ఓ భక్తురాలు పాముకాటుకు గురైనట్లు జరుగుతున్న ప్రచారాన్ని తితిదే(ఋణ) ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు వాస్తవంగా అక్కడేం జరిగిందో వివరిస్తూ ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం సైతం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

"తిరుమల క్యూలైన్‌లో భక్తురాలు పాముకాటుకు గురైనట్లు కొందరు చేస్తున్న ప్రచారంలో నిజం లేదు. వాస్తవానికి జరిగింది ఏమిటంటే.. వరంగల్‌కు చెందిన శరత్ బాబు, మౌనిక దంపతులు ఆదివారం (ఫిబ్రవరి 22) రాత్రి స్వామి దర్శనం కోసం టాక్సీలో ఎస్వీ మ్యూజియం వద్దకు వచ్చారు. ఆర్.బి.సెంటర్ పార్కింగ్ ఏరియా వద్దకు రాగానే తన కాలికి పసుపు రాసుకునే ఉద్దేశంతో మౌనిక కారు నుంచి కిందకు దిగారు. ఆ సమయంలో తన కాలికి ఏదో తాకడంతో ఆమె భయంతో గట్టిగా అరిచారు. వెంటనే ఆమె భర్త శరత్ బాబు వెతికి చూడగా అక్కడ ఒక పాము పిల్ల కనిపించింది.

దీంతో అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది మౌనికను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. భక్తురాలిని పరీక్షించిన వైద్యులు ఆమె పాముకాటుకు గురికాలేదని నిర్ధారించారు. అయినప్పటికీ ఆమె శ్రేయస్సుని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తగా తిరుపతిలోని స్విమ్స్‌లో చేర్చారు. స్విమ్స్ వైద్యులు సైతం ఆమె పాము కాటుకు గురికాలేదని చెప్పారు. అలాగే, అక్కడ కనిపించిన పాము కూడా విషపూరితం కాదని తేలింది. ఈ ఘటన జరిగిన వెంటనే తితిదే సిబ్బంది స్పందించిన తీరుకు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉదయం ఆ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. జరిగింది ఇదీ. అందువల్ల కొందరు చేస్తున్న ఫేక్ ప్రచారాలను భక్తులు నమ్మొద్దు" అని విజ్ఞప్తి చేసింది.

# రాజ్యసభ రేసులో మహ్మద్ అలీ షబ్బీర్..

**– ఆశవాహుల్లో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే**

మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకులు ప్రస్తుతం ప్రభుత్వ సలాదారులుగా కొనసాగుతున్న మమ్మద్ అలీ షబ్బీర్ రాజ్యసభ కు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మహ్మద్ అలీ షబ్బీర్ తో పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎంపీ మధు యాష్కిగౌడ్, బాల్కొండ మాజీ శాసనసభ్యులు ఈరవత్రి అనిల్ లు రాజ్యసభ సీటు కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి తోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజ్యసభరేసులో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రాజ్యసభ పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. తెలంగాణ రాష్ట్రం నుండి త్వరలో జరగనున్న రెండు రాజ్యసభ స్థానాల కు ఎన్నికలు జరగనున్నాయి. ఆ రెండు స్థానాలను గెలుచుకునే సత్తా అధికార కాంగ్రెస్ పార్టీకి ఉన్నాయి. కేవలం 40 మంది ఎమ్మెల్యేలు ఓటు వేస్తే రాజ్యసభస్థానం గెలుచుకునే అవకాశం ఉంటుంది. దీంతో ఎవరిని పెద్దల సభకు పంపాలనే ఆలోచనపై ఏఐసీసీ తో పాటు రాష్ట్ర కమిటీ కసరత్తు చేపట్టింది. ఈ రెండు స్థానాల్లో ఒక స్థానాన్ని ఏఐసీసీ ఎంపిక చేసిన వారికి కేటాయిస్తారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మనుసింఘ్వి కి కేటాయించే అవకాశాలున్నాయి. దీంతో మిగిలిన ఒక స్థానం కోసం పార్టీ సీనియర్లు పోటీ పడుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్ వైపు రాష్ట్ర పార్టీ హై కమాండ్ ముగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి. ఇదే తరహాలో గతంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులుగా రెండు పర్యాయాలు సేవలు అందించిన మధు యాష్కి గౌడ్ తన వంతు ప్రయత్నం చేశారు. ఢిల్లీ స్థాయిలో తనకున్న పరిచయాలతో ఎలాగైనా పెద్దల సభకు అవకాశం కల్పించాలని హై కమాండ్ వద్ద తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీనగర్ నుండి పోటీ చేసి ఓడిపోయిన మధు యాష్కి గౌడ్ ఆ తర్వాత ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా తనదైన శైలిలో ప్రయత్నించిన చివరికి హై



కమాండ్ మహేష్ కుమార్ గౌడ్ వైపు మొగ్గు చూపింది. మహేష్ కుమార్ గౌడ్ కు పీసీసీ చీఫ్ పదవి రావడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలకపాత్ర పోషించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. తాజాగా జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో ను అభ్యర్థి ఎంపిక లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లు కీలకపాత్ర పోషించనున్నారు. ఆ ఇద్దరి మద్దతు సీనియర్ నాయకుడు మహమ్మద్ అలీ షబ్బీర్ వైపేఉంటుందన్న ప్రచారం పార్టీలో నెలకొంది. దీంతో దాదాపుగా మమ్మద్ అలీ షబ్బీర్ పెద్దల సభకు వెళ్లడం ఖాయమనే అభిప్రాయాలు మెజార్టీ పార్టీ నేతల్లో వ్యక్తం అవుతుంది. అయితే సామాజిక సమీకరణలో భాగంగా మైనార్టీ వర్గానికి పెద్ద పీట వేసే అవకాశం ఉండడంతో షబ్బీర్ అలీ ఎంపిక దాదాపు ఖరారాలైనట్లేనని పార్టీలో ప్రచారం మొదలైంది. అయితే షబ్బీర్ అలీ ని ఎంపిక చేస్తే ఆ పదవి కోసం పోటీ పడుతున్న ఆశావాహుల నుండి పెద్ద ఎత్తున అసంతృప్తి జ్వాలలు వెల్లువెత్తే అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న పార్టీ పెద్దలు ఏఐసీసీ, పీసీసీ లు సమన్వయంతో అభ్యర్థి ఎంపికపై ముందుకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. రాజ్యసభ కోసం పోటీ పడుతున్న నేతలను బుజ్జగించడంతోపాటు అభ్యర్థి ఎంపికపై ఏకగ్రీవ నిర్ణయానికి పార్టీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ సీనియర్ నేతలు వి. హనుమంతరావు, షబ్బీర్ అలీల మధ్య నే తీవ్రమైన పోటీ ఉండే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అతి తొందర్లోనే అభ్యర్థిని ఎంపిక చేసేందుకు పార్టీ నాయకత్వం తెరనుక భారీ కసరత్తు చేపట్టింది.

# ధర్మపురి సంజయ్ కి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి కేటాయించాలి..

నిజామాబాద్ జిల్లా ధర్మపురి సంజయ్ కి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి కేటాయించాలి. టీపీసీసీ చీఫ్ కు మున్నూరు కాపు కులస్తుల వినతి. గాంధీభవన్ కు భారీగా తరలిన మున్నూరు కాపు ప్రతినిధులు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ నగర తొలి మేయర్ ధర్మపురి సంజయ్ కి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి కేటాయించాలని మున్నూరు కాపు కులానికి చెందిన ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా నుండి పెద్ద ఎత్తున సోమవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ కు తరలి వెళ్లారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అందుబాటులో లేకపోవడంతో గాంధీభవన్ ఇంచార్జ్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్ రావుకు వినతి పత్రం అందజేశారు.మహేష్ కుమార్ గౌడ్ కు తమ ఆవేదనతో కూడిన వినతి పత్రాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా లో సుమారు 4,50,000. మంది మున్నూరు కాపు ఓటర్లు ఉన్నారని గుర్తు చేశారు. గత 12 సంవత్సరాలుగా నిజామాబాద్ జిల్లా లో మాకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా పోయిందని వినతి పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు.. కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఉందని ఈ సందర్భంగా ప్రతినిధులు వెల్లడించారు.. పార్టీలకతీతంగా మున్నూరు కాపు



సోదరులందరం, సోదరిమనులందరు ఏకమై మేము మీకు విన్నవించుకున్నది ఏమనగా మా జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ కి మీరు ఏదైనా గౌరవప్రదమైన పదవి ఇచ్చి మున్నూరు కాపుల అభ్యున్నతి కి నాంది పలకాలని మా మనవి అని వారు అన్నారు. సంజయ్ గతంలో మేయర్ గా పని చేశారని, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో క్రియాశీలకంగా నిజామాబాద్ కార్పొరేషన్ ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునే విధంగా పనిచేశారని స్పష్టం చేశారు.. గతంలో కాంగ్రెస్ పార్టీ మున్నూరు కాపులకు ఇచ్చిన ప్రాతినిధ్యాన్ని ఎన్నటికీ మర్చిపోమని మున్నూరు కాపు సోదరసోదరిమనులం అందరం ఏకగ్రీవంగా కోరుకుంటున్నామన్నారు. మున్నూరు కాపు సోదరులు అందరం కూడా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడతామని, మా అందరికీ నాయకత్వం వహిస్తున్న మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ కి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవి అప్పగించి మున్నూరు కాపులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. నిజామాబాద్ జిల్లా నుండి గాంధీభవన్ కు తరలి వెళ్లిన వారిలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

# సబ్ ఎడిటర్లందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలి

**– జిల్లా కమిటీలో డెస్క్ జర్నలిస్టులకు చోటివ్వాలి**
**– డీజేఎఫ్‌టీ ఆదిలాబాద్ జిల్లా కమిటీ డిమాండ్**
**– కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

**ఈకాలం,ఆదిలాబాద్**

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేసే సబ్ ఎడిటర్లందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని డీజేఎఫ్‌టీ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనికి టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సురేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా డీజేఎఫ్‌టీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్. దత్తాత్రి, అధ్యక్షుడు ఐ. సాయిరాం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం 252 వల్ల సబ్ ఎడిటర్లకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. గత జీవో ప్రకారం ఉమ్మడి జిల్లాకు (33 జిల్లాలకు) ఐదుగురికి, ఎడిషన్ సెంటర్‌లో అదనంగా ముగ్గురు డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు వచ్చాయని తెలిపారు. ఇప్పుడు కేవలం ఎడిషన్ సెంటర్‌కు నాలుగు అక్రెడిటేషన్లు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టారని అన్నారు. ఈ నిబంధన వల్ల చాలామంది డెస్క్ జర్నలిస్టులు అక్రెడిటేషన్లకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పనిచేసినా, ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్క్‌లు వేరుగా ఉంటాయని తెలిపారు. ప్రతీ



కొత్త జిల్లాకు ఒక ఇన్‌చార్జితో పాటు నలుగురు సబ్ ఎడిటర్లు ఉంటారని, కొత్త జీవో ప్రకారం ఎడిషన్‌కు నాలుగు కార్డులే ఇస్తే కనీసం ఆ జిల్లాల ఇన్‌చార్జిలకు కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. కాబట్టి ఎడిషన్ల వారీగా కాకుండా, సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా ప్రతి కొత్త జిల్లాలో సబ్ ఎడిటర్లకు ఐదు అక్రెడిటేషన్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. అలాగే జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో డెస్క్ జర్నలిస్టులకు చోటు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజేఎఫ్‌టీ నాయకులు కే. రాజన్న, నిలేష్, ఆరీఫ్, రాజశేఖర్ జర్నలిస్టులు స్వామి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పాత పాల్వంచ ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం

**– 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**

భర్త కొత్వాల తోపాటు పాత పాల్వంచలో విస్తృతంగా పర్యటించిన విమలాదేవి పాత పాల్వంచ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు – రోడ్లు, డ్రైన్లు, పారిశుద్యం, మంచి నీటి సరఫరా, స్ట్రీట్ లైటింగ్ వంటి వసతులు కల్పనకు కృషి చేస్తానని 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. తన భర్త రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్,



డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తో కలిసి పాత పాల్వంచలోని రజక బజార్, ముదిరాజ్ బజార్ లలో విమలాదేవి విస్తృతంగా పర్యటించారు శానిటేషన్, ఎలక్ట్రికల్, వాటర్ సప్లై, మిషన్ భగీరథ సిబ్బందితో పర్యటించి, ప్రజా సమస్యల పరిష్కారానికై సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా విమలాదేవి మాట్లాడుతూ తానెప్పుడూ ప్రజాసమస్యల పరిష్కారానికై ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, వార్డ్ ఆఫీసర్ చందార్కార్, కాంగ్రెస్ నాయకులు వాసుమల్ల సుందర్ రావు, సయ్యద్ యాకుబ్, నిమ్మల మల్లిఖార్జున్, షేక్ ఖాజామియా, షేక్ కరీం, నిమ్మల వెంకట్రావు, పెంకి శ్రీను, ధర్మరాజుల రమేష్, డీవీ , సయ్యద్ వజిర్, ధర్మరాజుల సాయిబాబు, ముదిగొండ శ్రీను, ప్రభాకర్, ముదిగొండ నాగేశ్వరరావు, కుసుమరాజుల సరవయ్య, కుసుమరాజుల కృష్ణ, బూసి శ్రీను, తిరుమలరావు, కిషోర్, యడ్ల ముత్యం, నిమ్మల గోపాలకృష్ణ, నిమ్మల పురుషోత్తమ్, సాంబశివరావు, ఉషా కిరణ్, నిమ్మల మోహన్, బొడ్డు రాములు, బొందిల బాలు, షేక్ యాకుబ్, బండారు తేజ, బొమ్మకంటి సంపత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాద క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్





**ఈకాలం, ఆదిలాబాద్**

ఉట్నూర్ మండలం షాంపూర్ సమీపంలోని వాగులో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడ్డ వారిని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరామర్శించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రిమ్స్ కు వెళ్లి క్షతగాత్రులతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరుపై వారిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, పలువురు వైద్యులు,బిజెపి నాయకులు ఉన్నారు.

# నేడు ఆదిలాబాద్ కు కేటీఆర్!



**ఈకాలం, ఆదిలాబాద్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్ ) మంగళవారం ఆదిలాబాద్ కు రానున్నారు. క్యాతన్ పల్లి ఘటనలో ఆదిలాబాద్ జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను పరామర్శించనున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకుంటారని వెల్లడించారు.

# సుమన్ కు బెయిల్ రాకుండా ప్రభుత్వం కుట్ర



**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**ఈకాలం, ఆదిలాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం మంట గలుస్తోందని, అరాచక పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్ రాకుండా ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు.

క్యాతన్ పల్లి ఘటనలో ఆదిలాబాద్ జిల్లా జైలు లో ఉన్న మాజీ ఎమ్మెల్లే బాల్క సుమన్ ను సోమవారం కలిసి ములాఖత్ అయ్యారు.

అనంతరం కొప్పుల ఈశ్వర్ మీడియా తో మాట్లాడుతూ... క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీ నేతల పట్ల వ్యవహరించిన తీరు అప్రజాస్వామికం అన్నారు. చైర్మన్ ఎన్నిక జరిగే వరకు సుమన్ ను జైలు లో ఉంచాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. సుమన్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. జైలు లో సుమన్ కు సరైన సదుపాయాలు కల్పించకపోగా, అనారోగ్యంతో ఉన్న ఆయనకు వైద్యం సైతం అందించడం లేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో క్యాతన పల్లి చైర్మన్ పిఠమే లక్ష్యం గా కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి వివేక్ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధంగా నీచ రాజకీయాలకు తెరలేపారన్నారు. ప్రజాస్వామ్యన్ని పరిరక్షించేందుకు నడుం బిగించిన బాల్క సుమన్ తో పాటు, బీఅర్ఎస్ నేతల పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. సుమన్ కు బెయిల్ రాకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. కస్టడీ కోరుతూ పోలీసులు బాల్క సుమన్ ను వేదించాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఈకాలం
THE HONEST TELUGU DAILY
24-02-2026

# మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరణ..

కామరెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.జిల్లా కేంద్రం లోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మధుమోహన్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మరియు ఎంపీ సురేష్ శెట్కార్ సమక్షంలో చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి చే బాధ్యతలు స్వీకరిస్తున్నట్టు తొలి సంతకం చేయించడం జరిగింది.తద్వారా జరిగిన సమావేశంలో షబ్బీర్ అలీ,సురేష్ శెట్కార్ మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున రావాల్సిన నిధులు కామారెడ్డి మున్సిపాలిటీ కోసం వచ్చేలా కృషి చేస్తామని తద్వారా భవిష్యత్తులో కామరెడ్డి ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని తెలిపారు.చైర్ పర్సన్ ఉమారాణి మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా అందరి కౌన్సిలర్లతో కలిసి కామరెడ్డి మున్సిపాలిటీని అభివృద్ధి లో ముందుకు తీసుకెళ్తామని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి,గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,కాంగ్రెస్ మరియు బారాస కౌన్సిలర్లు,డీఈ,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణి కి 83 దరఖాస్తులు..

**- జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి జిల్లా కలెక్టర్ లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో 83 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ఆయా శాఖలకు సంబంధించిన భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు కొరకు , ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల పేమెంట్ రాలేదని, పంచాయితీ, డి.ఆర్.డి.ఓ. డి.డబ్ల్యు.ఓ. తదితర వాటి దరఖాస్తులను స్వీకరించి అర్జీదారుని సమస్యను క్లుప్తంగా పరిశీలించి, పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ గ్రీవెన్స్ లో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, సీఈఓ చందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మరణానంతరం శరీరాన్ని ప్రభుత్వ కళాశాలకు రాసి ఇచ్చిన ఆర్.ఎం.పి వైద్యురాలు కొండూరి అనూష




కొత్తగూడెం :మరణానంతరం శరీరాన్ని ప్రభుత్వ కళాశాలకు రాసి ఇచ్చిన ఆర్.ఎం.పి వైద్యురాలు కొండూరి అనూష. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి నేత్ర, అవయవ ప్రోత్సహకుల సంఘం వ్యవస్థాపకురాలు కమల రాణి కొచ్చెర్ల మాట్లాడుతూ అనూష తన మరణానంతరం వైద్యాకాలశాలకు తన శరీరాని ఇస్తానని కుటుంభసభ్యుల సమక్షంలో లో రాసి ఇవ్వడం చాలా సంతోషాశీగా ఉందని తెలిపారు.వైద్య విద్యార్థులు ప్రయోగానికి ఉపయోగ పడేలా ఈ నిర్ణయం తీసుకోవడం ఆనందం వ్యక్తం చేసారు.మరణానంతరం కూడా కొన్ని జీవితాల్లో వెలుగులు నింపే సమాజ స్పృహ ఉన్న వాళ్ళు అవసరం.ఇంకెవరైనా నేత్ర, అవయవాలు దానం చేసేవాళ్ళుంటే ఈ నెంబర్ను సంప్రదించాలని 8919569524. ఝాన్సీ రాణి నేత్ర, అవయవ ప్రోత్సహకుల సంఘం వ్యవస్థాపకురాలు కమల రాణి కొచ్చెర్ల అన్నారు.

## కొప్పులఈశ్వర్ కు మాలల స్వాగతం!



**ఈకాలం, ఆదిలాబాద్ :**
క్యాతన్ పల్లి ఘటనలో ఆదిలాబాద్ జైల్లో ఉన్న బాల్క సుమన్ ను పరామర్శించడానికి వచ్చిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను ఆదిలాబాద్ మాల సంఘ సభ్యులు ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో జిల్లా మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బేరదేవన్న, అశోక్, స్వామి, ఆదిలాబాద్ 49 వార్డ్ బిఆరెస్ అధ్యక్షులు పాశం రాఘవేంద్ర, తాంసి మండల మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, మల్లెల స్వామి, సృజన్, శంకర్ సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో పబ్లిక్ పరీక్షల నిర్వహణకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు, సి-సెంటర్ కస్టోడియన్లు, మండల విద్యాశాఖాధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పరీక్షలకు 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని వెల్లడించారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అత్యంత కీలక అంశం కావడంతో పరీక్షల నిర్వహణలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లు మరియు సెంటర్ సూపరింటెండెంట్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారులు (ఎం ఈ ఒ లు), రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్ డి ఓ లు) తమ పరిధిలోని పరీక్షా కేంద్రాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని సూచించారు.గతంలో చోటుచేసుకున్న సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశ్నపత్రాల భద్రత, రవాణా, భద్రపరిచే విధానం, సమయపాలన వంటి అంశాల్లో ఎటువంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ



సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బి ని అమలు చేయడంతో పాటు, పోలీస్ శాఖ ద్వారా పర్యవేక్షణను బలోపేతం చేయాలని అన్నారు . కాపీచేసే చర్యలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు పరిశీలక బృందాలను నియమించాలని ఆదేశించారు.విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అనుకూల పరిస్థితులు కల్పించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, సరిపడ ఫర్నిచర్, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు రైటర్ సౌకర్యం, ర్యాంపులు తదితర అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.
అన్ని పరీక్షా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది విధిగా తమ ఐడీ కార్డులను ధరించాలని కలెక్టర్ స్పష్టంగా ఆదేశించారు. ఐడీ కార్డు లేకుండా ఎవరినీ పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించరాదని ఆదేశించారు .చీఫ్ సూపరింటెండెంట్లు ప్రభుత్వ నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధించబడినవని, నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సవాల్ చేసి తోకముడిచిన ఎమ్మెల్యే: రమణారెడ్డి..

**- రాజీనామా డ్రామాను బట్టబయలు చేసిన కాంగ్రెస్**
**- ఆధారాలతో రండి.. కలెక్టర్ ముందే తేల్చుకుందాం**



కామారెడ్డి ఎమ్మెల్యే శాసనసభ్యులు అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తా" అంటూ ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, తీరా సమయం వచ్చేసరికి చర్చకు భయపడి పారిపోయారని కాంగ్రెస్ నాయకుడు సందీప్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.సోమవారం కలెక్టరేట్ వేదికగా జరిగిన హైడ్రామా ఎమ్మెల్యే అసలు రంగును బయటపెట్టిందని ఆయన విమర్శించారు.-కలెక్టర్ షాక్: అసలు సమయమే తీసుకోలేదట! ఎమ్మెల్యే విసిరిన సవాల్‌ను స్వీకరిస్తూ పూర్తి ఆధారాలతో కలెక్టరేట్‌కు చేరుకున్న కాంగ్రెస్ నాయకులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. "మేము ఆధారాలతో కలెక్టర్ వద్దకు వెళ్తే, ఆయన ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యే చర్చ కోసం తన వద్ద ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోలేదని, కేవలం ఒక వినతిపత్రం ఇచ్చి వెళ్ళిపోయారని కలెక్టర్ స్పష్టం చేశారు" అని తెలిపారు."సవాల్ విసరడం.. చర్చ సమయానికి తోకముడవడం ఎమ్మెల్యేకు అలవాటుగా మారింది.ఇది ఆయన అభద్రతా భావానికి పరాకాష్ట." ఆర్టీఐ (ఆర్.టి.ఐ.) వెనుక 40 రోజుల స్కెచ్! ఎమ్మెల్యే తెలివిగా ఆర్టీఐ అప్లికేషన్ అస్త్రంగా వాడుకుంటున్నారని సందీప్ మండిపడ్డారు.తప్పించుకునే ఎత్తుగడ: ఆర్టీఐ సమాచారానికి 40 రోజుల గడువు ఉంటుందని, ఆ లోపు ప్రజల దృష్టి మళ్ళించి తప్పించుకోవచ్చని ఎమ్మెల్యే ప్లాన్ చేస్తున్నారని ఆరోపించారు.?ఉలుకెందుకు?: అవినీతి చేయనప్పుడు చర్చకు రాకుండా, కలెక్టర్ సమయం తీసుకోకుండా ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు.రాజీనామాకు సిద్ధంగా ఉండు.. వదిలిపెట్టే ప్రసక్తి లేదు!ఎమ్మెల్యే అవినీతి చిట్టా తమ వద్ద సిద్ధంగా ఉందని, ఆయన రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోమని సందీప్ హెచ్చరించారు.జేఏసీ ఏర్పాటు: విద్యార్థి సంఘాలు, మేధావులు, కుల సంఘాలను ఏకం చేసి భారీ స్థాయిలో జేఏసీ (జె.ఏ.సి.)ని ఏర్పాటు చేస్తాం.ప్రతి గల్లీలో ఎమ్మెల్యే అవినీతిని ఎండగడతాం.?మాట తప్పిన ఎమ్మెల్యేకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, ఆయన పతనం మొదలైందని వ్యాఖ్యానించారు. వినతిపత్రాల పేరుతో కాలయాపన చేస్తూ, సవాల్ చేసి పారిపోవడం రమణారెడ్డి నైజమని, త్వరలోనే ఆయన అవినీతి బండారాన్ని ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతామని కాంగ్రెస్ శ్రేణులు స్పష్టం చేశాయి.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు చంద్రశేఖర్ కూడా పాల్గొన్నారు
7

# కొమ్మాలగుట్టలో బ్రహ్మోత్సవాల సందడి

**- 54 అడుగుల ప్రభ బండి నిర్మాణం జోరుగా మార్చి 3న జాతర బండ్లు ప్రధాన ఆకర్షణ**

గీసుగొండ మండలం కొమ్మాలగుట్టలోని కొమ్మాలగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం లో శ్రీ విశ్వావసు నామ సంవత్సర బ్రహ్మోత్సవాలు, జాతర మహోత్సవాలు ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగి, భక్తిశ్రద్ధలతో ఉత్సవాల కోసం సిద్ధమవుతోంది. ఈ నెల 23న సోమవారం రాత్రి 8 గంటలకు అధ్యయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మార్చి 3న జరిగే జాతర బండ్లు తిరుగుట ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. జాతర వైభవాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా చాటిచెప్పేందుకు 54 అడుగుల ఎత్తుతో ప్రభ బండి నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే ఈ ప్రభ బండి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి సౌజన్యంతో నిర్మితమవుతున్న ఈ ప్రభ బండి జాతర మహోత్సవాలకు ప్రత్యేక శోభను చేకూర్చనుంది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతుండగా జిల్లా నాయకులు వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్, అల్లం మర్రెడ్డి, డోలె చిన్ని పర్యవేక్షిస్తున్నారు. గ్రామ యువత, నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని పనులను వేగవంతం చేస్తున్నారు. కార్యక్రమంలో కొమ్మాల గ్రామ సర్పంచ్ యమున ప్రవీణ్, దస్రుతండా సర్పంచ్ అమృత బిక్షపతి, మనుగొండ సర్పంచ్ పేర్ల శ్రవణ్ సహా



పలు గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కృపాకటాక్షాలతో బ్రహ్మోత్సవాలు, జాతర మహోత్సవాలు విజయవంతంగా, శాంతియుతంగా, భక్తి ప్రపత్తులతో కొనసాగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# జోగిపేట వాసికి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందజేసిన మంత్రి దామోదర రాజనర్సింహ.



జోగిపేట మున్సిపాలిటీ లోని జోగిపేట పట్టణం లో ఊపిరితిత్తుల సంబంధ అనారోగ్యంతో బాధపడుతున్న జోగిపేట వాసికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అందజేశారు. జోగిపేట 16వ వార్డుకు చెందిన గంజి మల్లేశం చాలాకాలంగా ఊపిరితిత్తుల సంబందించిన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇదివరకే చికిత్స కోసం లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయని, ప్రతినెలా 10వేల రూపాయలు వెచ్చించి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్, బై ప్యాక్ మెషిన్ అద్దెకు తెచుకుంటునట్లు వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో మంత్రి ఇచ్చిన హామీ మేరకు సోమవారం మినిష్టర్ క్వార్టర్స్ లో మంత్రి దామోదర చేతుల మీదుగా మల్లేశం కుటుంబ సభ్యులకు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్, బై ప్యాక్ మెషిన్ అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149